క్లుప్తంగా

రోడ్డు మరమ్మతు చేయించాలి



ధర్నా చేస్తున్న తండావాసులు

నల్లమాడ: టిప్పర్ల రాకపోకలతో దెబ్బతిన్న తమ గ్రామ రోడ్డును మరమ్మతు చేయించాలని కొండకింద తండావాసులు మంగళవారం గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా తండావాసులు మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో భాగంగా తండా రోడ్డు మీదుగా కొన్ని నెలల నుంచి రేయింబవళ్లు టిప్పర్లు తిప్పుతున్నారన్నారు. దీంతో రోడ్డు అడుగుకో గుంత ఏర్పడి రాకపోకలు సాగించడానికి వీలులేకుండా తయారైందని వాపోయారు. రోడ్డు నిర్మాణ సంస్థకు చెందిన పీఆర్‌ఓ సుధాకర్‌రెడ్డి ఆందోళనకారుల వద్దకు చేరుకొని రోడ్డు మరమ్మతు చేయిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

చెన్నేకొత్తపల్లి: మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దామని బీసీ హాస్టల్ వార్డెన్ నరసింహమూర్తి విద్యార్థులకు సూచించారు. మంగళవారం హాస్టల్ నుంచి ఉన్నత పాఠశాల వరకూ ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా వార్డెన్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మూడు రోజుల పాటు పర్యావరణం, పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

ఆర్వో ప్లాంటు ప్రారంభం

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలిక వసతిగృహంలో మంగళవారం ఆర్‌ఓ ప్లాంటును ప్రారంభించారు. వార్డెన్ శ్యామల మాట్లాడుతూ పెనుకొండ సాహితీ గగన మహల్ ట్రస్ట్ వారు విద్యార్థినుల సౌకర్యార్థం ఉచితంగా ప్లాంటు ఏర్పాటు చేశారన్నారు. ప్లాంట్‌ను ట్రస్ట్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు.

గ్రాప్లింగ్, రెజ్లింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

కదిరి అర్బన్: ఈ నెల 12, 13 తేదీల్లో తిరుపతిలో జరిగిన గ్రాప్లింగ్, రెజ్లింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో కదిరి పట్టణంలోని బ్లూమూన్ పాఠశాల విద్యార్థులు విష్ణువర్ధన్, మనోహర్ మూడోస్థానంలో నిలిచి మెడల్స్ పొందారు. అలాగే బ్లూమూన్ డిగ్రీ కళాశాలకు చెందిన నికితాబాయి రెజ్లింగ్ పోటీల్లో ద్వితీయస్థానం కైవసం చేసుకుంది. రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత శివశంకర్ మంగళవారం అభినందించారు.

సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి

ధర్మవరం అర్బన్: సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నామని ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, పుట్టపర్తి అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీరామ్ తెలిపారు. పట్టణంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను మంగళవారం వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం ఎక్సైజ్ సీఐ చంద్రమణి, ఎస్‌ఐ చాంద్‌బాషా, సిబ్బందితో మాట్లాడారు. నాటుసారా నిర్మూలనకు ఎప్పటికప్పుడు దాడులు నిర్వహించాలని సూచించారు. 'నవోదయం' కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని తెలిపారు.

సమస్యలు తీర్చే వరకు దీక్షలు విరమించబోం



నిరసన తెలుపుతున్న కార్మికులు

ధర్మవరం: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు తీర్చే వరకు రిలే దీక్షలు విరమించబోమని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సంఘం నాయకులు బాబు, అనిల్ తేల్చి చెప్పారు. మున్సిపల్ కార్యాలయం ముందు చేపట్టిన రిలే దీక్షలు మంగళవారంతో 20వ రోజులు పూర్తి చేసుకున్నాయి. నాయకులు బొగ్గు నాగరాజు, బాబు, అనిల్ మాట్లాడుతూ జీఓ 36 ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఇంజినీరింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. మూడు వారాలుగా దీక్షలు చేస్తున్నా అధికారులు స్పందించకపోవడంతో చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలియజేశారు.

హామీలు నిలబెట్టుకోవాలి

పుట్టపర్తి టౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిలబెట్టు కోవాలని ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్యాలయం ముందు ఆకులు అలములు తింటూ నిరసన తెలియజేశారు.

నీటి కష్టాలు తీరేనా?

- సోమాల ఒడ్డు కట్ట పునఃనిర్మిస్తే ఎంతో ప్రయోజనం
- ఎనిమిది గ్రామాల ప్రజలకు నీటి ఎద్దడి నుంచి ఊరట
- ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజల వేడుకోలు



గండిపడి తెగిన సోమాల ఒడ్డు కట్ట

తలుపుల: వర్షపు నీటిని ఒడిసిపట్టి సాగు- తాగు నీటి అవసరాలకు వినియోగించుకోవడం కోసం పూర్వీకులు నిర్మించిన సోమాల ఒడ్డుకట్ట క్రమేణా శిథిలదశకు చేరుకుంది. మంచి ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఒడ్డుకట్టను తిరిగి పటిష్టపరిస్తే ఎంతో ఉపయోగపడుతుందని ప్రజలు పేర్కొంటున్నారు. బండ్లపల్లి పంచాయతీలో నూతనకాల్వ దిగువ, ఎగువ హరిజనవాడ, వైఎస్సార్ కాలనీ, దిగువ బైగారిపల్లి, పల్లవాండ్లపల్లి, బీసీ కాలనీ సహా ఎనిమిది గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణ కోసం దశాబ్దాల కిందట పెద్దలు ఒక ఆలోచన చేశారు. వర్షపు నీరు నిల్వ ఉంచి తాగు- సాగునీటి పెంపుదలకు ఉపయోగకరంగా ఉంచాలని దిగువ బైగారిపల్లికి చెందిన ఎర్రకొండ నారపురెడ్డి, నారమ్మ కుటుంబీకులకు చెందిన భూమిలో నూతనకాల్వ - బండ్లపల్లి వరకు ఆయా గ్రామాలకు ప్రయోజనం చేకూరాలని సోమాలఒడ్డు కట్ట నిర్మించారు. అప్పట్లో వర్షపునీరు వృథా కాకుండా నిలిచి దిగువ ప్రాంతాల్లో నీరు పుష్కలంగా ఉండేది. కాలక్రమంలో గండిపడి కట్ట తెగిపోయింది. అప్పటి నుంచి ఇప్పటిదాకా పై ప్రాంతం నుంచి వచ్చిన నీరు వచ్చినవి వచ్చినట్లే దిగువకు వెళ్లిపోతోంది. నీరు వృథా కాకుండా ఒడ్డుకట్ట పునఃనిర్మిస్తే భూగర్భజలాలు పెంపొంది దాదాపు 150 బోర్లలో నీరు సమృద్ధిగా ఉండే అవకాశం ఉంది. ప్రభుత్వం ఈ మేరకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వం స్పందించాలి

ఎనిమిది గ్రామాల్లో నీటి సౌకర్యం పెంపొందడానికి హంద్రీ-నీవా కాలువ దిగువ ప్రాంతంలో సోమాల ఒడ్డు కట్ట నిర్మించాల్సిన అవసరం ఉంది. తక్కువ ఖర్చుతో తూము ఏర్పాటు చేస్తే హంద్రీ-నీవా నీరు సోమాల ఒడ్డుకు వదిలి నింపవచ్చు. ఈ విషయంపై ప్రభుత్వం, అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలి.

– బి.మధుసూదన్‌రెడ్డి, పల్లవాండ్లపల్లి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా

బండ్లపల్లి పంచాయతీలో సోమాల ఒడ్డు కట్ట తెగిన విషయం నాకు తెలియదు. ఈ విషయంపై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పునఃనిర్మాణ పనులు చేపట్టడానికి చర్యలు చేపడతాం.

– అనీల, ఇరిగేషన్ ఏఈ, తలుపుల మండలం

వలసలు పోవాల్సిందే !



ఓవైపు వర్షాభావ పరిస్థితులు.. మరోవైపు వచ్చే అరకొర నీరు వృథా అవడం వల్ల నీటి వసతి తగ్గిపోయి పంటలు సాగు చేసుకోలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. గ్రామాల్లో పనులు లేకపోవడంతో బతుకుదెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలస పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– ఫణికుమార్‌రెడ్డి, రైతు, దిగువ బైగారిపల్లి

కట్ట నిర్మాణానికి పూర్తి సహకారం



సోమాల ఒడ్డు కట్ట మా కుటుంబీకుల పొలంలో ఉంది. కట్ట నిర్మాణం చేపడితే ఎన్నో కుటుంబాలకు ఆసరాగా నీరు పుష్కలంగా ఉంటుందని, కట్టనిర్మాణం చేపట్టడానికి ఎలాంటి అవరోధాలు లేకుండా నేను సర్పంచ్‌గా ఎన్నికైనపుడే కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రమాణ స్వీకారం రోజే అగ్రిమెంట్‌లో సంతకాలు చేసి అధికారులకు అప్పగించాం.

– వై.కొండారెడ్డి, సర్పంచ్, బండ్లపల్లి

త్వరగా నిర్మాణం చేపట్టాలి



మా గ్రామానికి ఎగువ ప్రాంతంలో ఉండే సోమాల ఒడ్డు కట్టతో పాటు పశువుల దాహార్తి తీర్చడానికి కుక్కల బావి వంకకు నిర్మించిన చెక్‌డ్యాం పునఃనిర్మాణం చేపడితే సుమారు 800 కుటుంబాల వారికి నీటి కొరత ఉండదు. ప్రభుత్వం, అధికారులు స్పందించి త్వరగా నిర్మాణ పనులు చేపట్టి రైతులను ఆదుకోవాలి.

– గోపాల్‌రెడ్డి, రైతు, పల్లవాండ్లపల్లి

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మ దేవతకు బోనాలు



చెన్నేకొత్తపల్లి: మేడాపురంలో గ్రామదేవత పెద్దమ్మతల్లికి మంగళవారం గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో బోనాలను సమర్పించారు. ఉదయాన్నే గ్రామ నడిబొడ్డున ఆలయంలో అమ్మవారి మూల విరాట్‌కు అభిషేకాలు చేసి పలు రకాల పుష్పాలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. మహిళలు బోనాలను తలపై పెట్టుకుని మేళతాళాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించారు. ఈసందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



నల్లచెరువులో మారెమ్మకు బోనాలు

వర్షం కోసం బోనాలు

నల్లచెరువు: ఖరీఫ్ పంటల సాగుకు అదను దాటుతున్నా పదునైన వర్షాలు కురవలేదు. మరోవైపు నీరు, గడ్డి లేక మూగజీవాలు ఇబ్బందులు పడుతున్నాయి. ఈ క్రమంలో వర్షం కోసం మండల కేంద్రం నల్లచెరువులో సర్పంచ్ పంచరత్నమ్మ ఆధ్వర్యంలో అంబేడ్కర్ కాలనీవాసులు మంగళవారం మారెమ్మకు ప్రత్యేక పూజలు చేసి జ్యోతుల బోనాలు సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో కళకళలాడేలా చూడు తల్లీ అంటూ ప్రార్థించారు.



ధర్మవరంలో కోటగడ్డ పెద్దమ్మకు..

భక్తిశ్రద్ధలతో బోనాలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కోటగడ్డ పెద్దమ్మ, దుర్గమ్మ ఆలయాలు మంగళవారం భక్తులతో కిటకిటలాడాయి. యాదవవీధి, సత్యసాయినగర్ తదితర వార్డుల నుంచి మహిళలు తలపై బోనాలు పెట్టుకుని మేళ,తాళాల నడుమ ఊరేగింపుగా ఆలయాలకు చేరుకున్నారు. ప్రదక్షిణలు చేసి అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం జంతుబలులు ఇచ్చారు.

బత్తలపల్లి: మండల కేంద్రం బత్తలపల్లిలోని వడ్డెర కాలనీలో పెద్దమ్మ తల్లికి మూడవ మంగళవారం భక్తులు బోనాలు తీసుకువెళ్లి, జంతుబలులు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ ప్రతి ఏటా ఆషాఢ మాసంలో గ్రామదేవతలకు బోనాలు సమర్పించడం వల్ల మంచి జరుగుతుందనేది నమ్మకమన్నారు.



బత్తలపల్లిలో విశేష పూజలందుకున్న పెద్దమ్మ తల్లి

శాకంబరీ దేవిగా కన్యకాపరమేశ్వరి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో మంగళవారం అమ్మవారు శాకంబరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనపై ఎంపీపీ మండిపాటు



ప్రొటోకాల్ పాటించని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ

కనగానపల్లి: అధికారులు ప్రొటోకాల్‌ను ఉల్లంఘించడంపై ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ మండిపడ్డారు. స్థానిక ఎంపీడీఓ కారాల్యయంలో మంగళవారం ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. గ్రామాల్లో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రొటోకాల్ ప్రకారం తనతో పాటు ఇతర వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులను ఆహ్వానించకపోవటంపై ఎంపీపీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ కార్యక్రమానికి తమను ఎందుకు ఆహ్వానించలేదని ఎంఈఓ శ్రీదేవిని ప్రశ్నించారు. అధికారికంగా జరిగే ప్రభుత్వ కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలన్న విషయం మండల స్థాయి అధికారులకు తెలియదా? అంటూ మండిపడ్డారు. ఇక సమావేశం మధ్యలో వచ్చిన కొందరు టీడీపీ ప్రజాప్రతినిధులు సర్వసభ్య సమావేశానికి అధికారులు అందరూ ఎందుకు రాలేదంటూ? ఎంపీడీఓ అనిల్‌కుమార్‌పై ఆగ్రహం వెలిబుచ్చారు. తర్వాతా తుపాకీతో కాల్చుకొని ఆత్మహత్య చేసుకొన్న శివపురం కొట్టాల సీఆర్‌పీఎఫ్ జవాన్ మురళీ మృతికి అధికారులు, ప్రజాప్రతినిధులు రెండు నిమిషాలు మౌనం పాటించి సమావేశాన్ని ముగించేశారు. వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, ఏఓ మాధురి, ఏపీఓ వెంకటేష్‌నాయక్, ఎంఈఓ అరుణమ్మ, ఏపీఎం హేమలత, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

అర్జీలపై తక్షణమే స్పందించాలి



సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ మహేష్

తాడిమర్రి: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలపై తక్షణమే స్పందించాలని ఆర్డీఓ మహేష్ అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలు, కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రైతులు, మహిళలు, వృద్ధులు తమ సమస్యలు ఇక్కడ పరిష్కారం కావని ధర్మవరం ఆర్డీఓ కార్యాలయం లేదా పుట్టపర్తిలో కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే పరిస్థితి కల్పించవద్దని అధికారులకు సూచించారు. అర్జీలకు త్వరగా పరిష్కారం చూపితే అర్జీదారులు ఉన్నతాధికారుల వద్దకు ఎందుకు వెళతారన్నారు. అలాగే పొలాల కొలతలు, రస్తాలు, పొలం గట్టు సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ రైతులకు ఉత్తమ సేవలు అందించాలన్నారు. ప్రతి ఒక్కరూ అంకిత భావంతో బాధ్యతగా వ్యవహరించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాస్కర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ హరి, జూనియర్ అసిస్టెంట్ దినేష్, సిబ్బంది, వీఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించరా..?



ఎంపీడీఓ కార్యాలయంలో 11:50 గంటలకు ఖాళీగా ఉన్న సిబ్బంది కుర్చీలు

నల్లచెరువు: మండ పరిషత్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందిలో చాలామంది సమయ పాలనకు తిలోదకాలిచ్చారు. ఎవరు ఎప్పుడు వస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ఎంపీడీఓ, ఏఓ మినహా మిగిలిన వారు సకాలంలో విధులకు హాజరు కావడం లేదు. మంగళవారం మధ్యాహ్నం 11:50 గంటల సమయంలో కార్యాలయంలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. ఉదయం 10 గంటలకు హాజరు కావాల్సిన అధికారులు, సిబ్బంది మధ్యాహ్నం వరకూ హాజరు కాకపోవడంతో పనులపై వచ్చే ప్రజలు, ప్రజాప్రతి నిధులు నిరాశతో వెనుదిరిగారు. కూటమి ప్రభుత్వంలో ఉద్యోగులపై పర్యవేక్షణ కొరవడటంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కార్యాలయంలో ఒకరుంటే మరొకరు ఉండటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు దృష్టి సారించి సిబ్బంది సమయ పాలన పాటించి, సత్వర సేవలు అందించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్షిప్త సమాచారం

వివాహిత అదృశ్యం



సౌజన్య

కొత్తచెరువు: కొడపగానిపల్లికి చెందిన సౌజన్య అనే వివాహిత అదృశ్యమైంది. గాజుల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించే ఈమె ఈ నెల 12న ఉదయం ఏడు గంటలకు ఆరోగ్యం బాగలేదని పుట్టపర్తి ఆస్పత్రికి బయల్దేరి తిరిగి ఇంటికి రాలేదు. ఎక్కడ వెదికినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో పెదనాన్న నాగయ్య ఫిర్యాదు మేరకు కొత్తచెరువు సీఐ మారుతీశంకర్ కేసు నమోదు చేశారు.

ఆరోగ్యంపై అవగాహన

కదిరి అర్బన్: పట్టణంలోని జైన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో అఖిలభారత చిన్నపిల్లల వైద్యుల సమాఖ్య ఆధ్వర్యంలో 'సంకల్ప్ సంపూర్ణ స్వాస్థ్య' కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. విద్యార్థుల ఎదుగుదలకు తీసుకోవాల్సిన ఆహారం గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా చిన్నపిల్లల వైద్యుల సమాఖ్య సహాయ కార్యదర్శి డాక్టర్ మదన్‌కుమార్, డాక్టర్ విద్యాసాగర్, పాఠశాల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరావ్‌తో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

దాడి కేసులో నిందితుడి అరెస్ట్

తనకల్లు: టి.సదుం గ్రామంలో పూజారి భాస్కర్ అనే వ్యక్తిపై ఈ నెల 11న కట్టెతో దాడి చేసిన కేసులో నిందితుడైన నల్లచెరువు మండలం దేవరింటిపల్లికి చెందిన ఇస్మాయిల్‌ను మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ గోపి తెలిపారు. దాడికి ఉపయోగించిన కట్టెను స్వాధీనం చేసుకున్నారు. నిందుతున్ని కోర్టులో హాజరుపరచగా.. న్యాయమూర్తి రిమాండ్ విధించారన్నారు.

మానవ అక్రమ రవాణాకు చెక్ పెడదాం

కదిరి టౌన్: మానవ అక్రమ రవాణాకు చెక్ పెట్టేందుకు అందరూ సమష్టిగా సహకరించాలని మమత స్వచ్ఛంద సంస్థ జిల్లా ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ శ్రీనివాసులునాయుడు కోరారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా మంగళవారం కదిరి రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ప్రయాణికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల కోసం చేపట్టే అక్రమ రవాణాలో మహిళలను, పిల్లలను రక్షించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్టేషన్ మాస్టర్ శివశంకర్ కుమార్, ఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐ శివారెడ్డి, జీఆర్పీ పోలీసులు, సంస్థ ప్రతినిధులు ఉమా శంకర్‌రెడ్డి, బాబ్జాన్, శారద తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

ధర్మవరం అర్బన్: పట్టణంలోని చిన్నూరుకు వెళ్లే రోడ్డు పక్కన బయలు ప్రదేశంలో మంగళవారం రాత్రి పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేశామని వన్ టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.16,200 నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

ప్రధానోపాధ్యాయులతో సమీక్ష

ధర్మవరం రూరల్: ఎంపీడీఓ సాయి మనోహర్ ఆధ్వర్యంలో మంగళవారం 'లక్ష్య పథకం – విద్యార్థుల ఆవిష్కరణకు తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా లింగ సమానత్వం, సంప్రదాయేతర ఉపాధి అవకాశాలు, భవిష్యత్ ప్రణాళిక, వృత్తి మార్గదర్శనం, ఆర్థిక సాక్షరత, బీమా పరిజ్ఞానం, ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగడం, పర్యావరణ పరిరక్షణ తదితర వాటిపై చర్చించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జలధికి పీర్లు

బత్తలపల్లి: మండలంలోని అప్పరాచెరువు, జ్వాలాపురం గ్రామాల్లో మొహర్రం ఉత్సవాల్లో భాగంగా మంగళవారం భక్తిశ్రద్ధలతో పీర్ల జలధి నిర్వహించారు. అంతకుముందు సోమవారం రాత్రి పానకాలు, పెద్ద సరిగెత్తు నిర్వహించారు. పీర్లకు ముజావర్లు ప్రత్యేక ఫాతెహా చేశారు. చావిడి ముందు ఏర్పాటు చేసిన అగ్నిగుండంలోకి పీర్లతో పాటు భక్తులు కూడా దిగారు. అనంతరం స్వాములను పురవీధుల్లో ఊరేగించారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మొహర్రం ప్రశాంతంగా ముగియడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

జలధికి తరలిన పీర్లు



బసంపల్లిలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి: బసంపల్లిలో మొహర్రం వేడుకలు మంగళవారం ముగిశాయి. తెల్లవారుజామున పీర్లను అగ్నిగుండం ప్రవేశం చేయించారు. సాయంత్రం గ్రామంలోని ప్రధాన వీధుల్లో డప్పు వాయిద్యాల నడుమ పీర్లను ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు పీర్లకు చక్కెరను చదివింపులు చేయించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పీర్లను జలధికి తరలించారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టండి

ఓడీచెరువు: అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం పిల్లలకు భోజనం పెట్టాలని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి ఆదేశించారు. మంగళవారం ఓడీచెరువులోని 1, 3 అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు కొండకమర్ల మినీ అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. పీపీ-1, పీపీ-2 పుస్తకాలను పంపిణీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి సూచనలు చేశారు. చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యను అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. సమయపాలన పాటించాలని సూచించారు. పీడీ వెంట సీడీపీఓ గాయత్రి, సూపర్‌వైజర్లు విజయకుమారి, సత్యవతి, గంగాదేవి ఉన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిత



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రిన్సిపాల్

ధర్మవరం అర్బన్: విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పద్మశ్రీ తెలిపారు. పట్టణంలోని తారకరామాపురంలోనున్న ఆర్డీటీ క్రీడా మైదానంలో మంగళవారం స్కూల్ టోర్నమెంట్ సీజన్-3లో భాగంగా కబడ్డీ, క్రికెట్ పోటీలను ఆమె ప్రారంభించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు క్రీడా పోటీలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తాయన్నారు. టోర్నీలో పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటున్నారన్నారు. కార్యక్రమంలో పీఈటీలు రాము, భాస్కర్, ప్రత్యూష, మల్లేష్, రమేష్, కోచ్‌లు పృథ్వీ, రాజశేఖర్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.